అంకితభావంతో పనిచేయాలి

కుత్బుల్లాపూర్: అంకితభావంతో పనిచేస్తే తప్పకుండా అనుకున్న లక్ష్యాన్ని చేరుతారని పేట్ బషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ విజయవర్ధన్ అన్నారు. మేడ్చల్ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకుంటున్న ట్రైనీ కానిస్టేబుల్స్ బుధవారం పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి ఇక్కడ సిబ్బంది చేస్తున్న పనితీరుపై ఆరా తీశారు. వీరికి ఇన్‌స్పెక్టర్ విజయవర్ధన్ పలు సూచనలు చేస్తూ సివిల్ కానిస్టేబుల్స్ విధులు ఇన్వెస్టిగేషన్ వివరాలు, ఎస్‌హెచ్‌ఓ పని విధానం, రైటర్స్, కోర్టు సమన్లు తదితర అంశాలపై వారికి అవగాహన కల్పిస్తూ ముందుకు సాగారు. స్టేషన్‌లో ఉన్న ప్రతి గదిని పరిశీలిస్తూ అక్కడ జరిగే పనితీరును వివరించారు. శిక్షణలో భాగంగా వచ్చిన ట్రైనింగ్ కానిస్టేబుళ్లు విధుల్లో చిత్తశుద్ధితో పని చేయాలని, వారికి తప్పకుండా ఏదో ఒక రోజు గుర్తింపు వస్తుందని హితువు పలికారు.


మాట్లాడుతున్న పేట్‌బషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ విజయవర్ధన్

ప్రహసనంగా సబ్ రిజిస్ట్రార్ బదిలీ!

- ప్రాధాన్యమున్న కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం
- దాదాపు ఏడాదిన్నర కాలంలో ముగ్గురి బదిలీ
- చర్చనీయాంశంగా ప్రభుత్వ నిర్ణయం



సూరారం చౌరస్తాలోని కుత్బుల్లాపూర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

కుత్బుల్లాపూర్: సబ్ రిజిస్ట్రార్ బదిలీల ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. గడచిన 15 నెలల కాలంలో ముగ్గురు అధికారులు మారడం అయోమయానికి గురిచేస్తుంది. మేడ్చల్ జిల్లాలో అత్యధికంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కొనసాగే కుత్బుల్లాపూర్‌లో పని చేసేందుకు అధికారులకు అనుభవం కావాలి. అయితే ఇక్కడ ప్రభుత్వం మాత్రం మూణ్నాళ్ల ముచ్చటగా అధికారులను నియమించడం.. ఆ తర్వాత బదిలీపై పంపించడం ఒక తంతుగా మారింది. 2013 ఆగస్టులో మహేందర్ సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టి పది నెలలు గడవక ముందే 2014 జూలై 31న సురేందర్‌ను సబ్ రిజిస్ట్రార్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రెండు నెలలు గడిచాయో లేదో..! నల్లగొండ జిల్లా మోత్కూర్ సబ్ రిజిస్ట్రార్ అశోక్‌ని నియమిస్తూ మంగళవారం తాజాగా ఉత్తర్వులు జారీ చేయడం విశేషం. ఇలా సబ్ రిజిస్ట్రార్‌ను నియమించి అలా బదిలీలు చేయడంపై విస్మయం వ్యక్తం అవుతున్నది.

డిమాండ్ తగ్గట్టుగా బదిలీలు...

కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం హాట్ కేకు లాంటిది. ఇక్కడ పని చేసేందుకు అధికారులు ఉత్సాహం చూపుతారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత గడిచిన 15 నెలల్లో ముగ్గురు అధికారులు మారడం స్థానికంగా చర్చగా మారింది. గతంలో ఇక్కడ పనిచేసిన మహేందర్, సురేందర్ స్థానిక పరిస్థితులను తెలుసుకోకముందే వారిని బదిలీ చేయడం తాజాగా మరొక వ్యక్తిని నియమించడంపై స్థానికులు పెదవి విరుస్తున్నారు. నిలకడలేని ఈ పరిస్థితుల్లో ఇక్కడ పనిచేసేందుకు అధికారులు ఉత్సాహం చూపకపోగా.. తాజాగా నియోజకవర్గ పరిధిలోని పలు సర్వే నెంబర్లు వక్ఫ్ భూముల పేరిట రిజిస్ట్రేషన్లు నిలుపుదల చేయడం విశేషం. ఏది ఏమైనా ఇక్కడ అధికారులు ఇలా వచ్చి అలా వెళ్లిపోవడంపై స్థానికులు అయోమయానికి గురవుతున్నారు.

అక్రమ నిర్మాణాలపై అధికారుల నిర్లక్ష్యం: బీజేపీ

నిజాంపేట్: ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని బీజేపీ నిజాంపేట్ కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు ఆకుల సతీష్ ఆరోపించారు. బుధవారం నిజాంపేట్ సర్వే నెంబరు 233/13లో కబ్జాకు గురైన 400 గజాల స్థలంలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాన్ని బీజేపీ నాయకులు సందర్శించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ... గతంలో బీజేపీ ఆధ్వర్యంలో అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో పనులు నిలిపి వేశారని, అయితే సదరు నిర్మాణదారులు తప్పుడు డాక్యూమెంట్లు సృష్టించి జీప్లస్-4 అనుమతులు పొంది యథేచ్ఛగా తిరిగి నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించి అక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు ఎంబరి ఆంజనేయులు, అరుణ్ రావు, ప్రసాద్, ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరం.. పట్టని వైనం!

సుభాష్‌నగర్: విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు తగలకుండా వారానికి ఒకసారి ఆయా ప్రాంతాల్లో సంబంధిత అధికారులు స్పెషల్ డ్రైవ్ కింద చెట్ల కొమ్మలను తొలగిస్తారు. గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిపివేసి చెట్ల కొమ్మలను తొలగించడం చూస్తూనే ఉన్నాం. కానీ ప్రధాన రోడ్లను ఆనుకొని పిచ్చి మొక్కలు విద్యుత్ స్తంభం పై వరకు అల్లుకొని ఉంటే సంబంధిత అధికారులకు సిబ్బందికి కనబడటం లేదాని పలువురు ప్రశ్నిస్తున్నారు. బహదూర్‌పల్లిలోని మేకల వెంకటేశం ఫంక్షన్ హాల్ వద్ద ఓ విద్యుత్ స్తంభానిపై వరకు పిచ్చి మొక్కలు తీగల అలుముకున్నాయి. ఇక సంబంధిత అధికారులు ఏ చర్యలు చేపడతారో చూడాలి.


విద్యుత్ స్తంభానికి అల్లుకున్న తీగలు

సమస్యల పరిష్కారానికి కృషి


శంకర్‌నగర్‌లో నూతనంగా వేసిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ

దుండిగల్: స్థానికంగా నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ఎల్లప్పుడు కృషి చేస్తానని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ గండిమైసమ్మలోని శంకర్ నగర్‌లో గత 10 సంవత్సరాలుగా వర్షాకాలంలో డ్రైనేజీ నీరు పొంగి స్థానికంగా ఉన్న అపార్ట్‌మెంట్‌లోకి లోనికి చేరుతున్నాయి. దీని వల్ల అపార్ట్‌మెంట్ వాసులు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారు. ఈ విషయంపై కాలనీవాసులు అధికారులకు ఎన్నో సార్లు విన్నవించినా స్పందించకపోవడంతో గత వారం హన్మంత్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఆయన దుండిగల్ మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి నూతనంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నారు. కొత్తగా డ్రైనేజీ పైపులైన్లను ఏర్పాటు చేయడంతో స్థానికులు హన్మంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా పాఠశాల

సుభాష్‌నగర్: దూలపల్లిలోని జడ్పీహెచ్ స్కూల్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. వారం రోజుల క్రితం దొంగలు పడి పాఠశాలలో విద్యుత్ వైర్లను కత్తిరించి ఎత్తుకెళ్లారు. ఈ విధంగా పాఠశాలలో జరగడం ఇది మూడోసారి. దీంతో పాఠశాల ఆవరణలో లైట్లు వెలగక పోవడంతో కొందరు మద్యం, డ్రగ్స్ సేవించడానికి అడ్డాగా మార్చుకున్నారు. గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో పాఠశాలకు సెక్యూరిటీని ఏర్పాటు చేయడం జరిగిందని, మున్సిపల్‌లో కలిసిన తరువాత సెక్యూరిటీ సిబ్బందిని నియమించకపోవడంతో పాఠశాల అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని పలువురు ఆరోపిస్తున్నారు. పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో సైతం రక్షణ కరువైందని, ఈ విషయమై అధికారులు స్పందించి తగుచర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

భారీ వర్షంతో అలుగు పోస్తున్న పెద్ద చెరువు

మేడ్చల్: మేడ్చల్ పరిసర ప్రాంతాల్లో బుధవారం భారీ వర్షం కురిసింది. మంగళవారం మధ్యాహ్నం, బుధవారం ఉదయం భారీ వర్షం పడడంతో ఉదయం వేళల్లో జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. పట్టణంలోని చాలా కాలనీలు జలమయమయ్యాయి. అధికారులు వర్షం నీటీని పల్లపు ప్రాంతాలకు మరల్చి సమస్యలను తీర్చారు. ఇప్పటికే భారీ వర్షాలు కురియడంతో జలకళతో ఉన్న చెరువులు, కుంటలు బుధవారం కురిసిన వర్షంతో మరింత పూర్తిగా నిండాయి. మేడ్చల్ పెద్ద చెరువు అలుగులు పోసింది.



నిర్మాణ వ్యర్థాల పారబోతను కట్టడిచేయాలి

కుత్బుల్లాపూర్: భవన నిర్మాణ వ్యర్థాలను రోడ్లు, బహిరంగ ప్రదేశాల్లో పారబోయకుండా కట్టడి చేయాలని అడిషనల్ కమిషనర్ (శానిటేషన్) రఘుప్రసాద్ అన్నారు. బుధవారం కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిల్ కార్యాలయ అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘుప్రసాద్ మాట్లాడుతూ... రోడ్ల పక్కన మట్టికుప్పలు, ఇళ్ల కూల్చివేత వ్యర్థాలను తరలించేందుకు ఈ నెల 23 నుంచి 29వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని గ్రేటర్ హైదరాబాద్ కమిషనర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారన్నారు. అందుకు అనుగుణంగా అధికారులు కార్యాచరణ రూపొందించుకుని నిర్మాణ కూల్చివేత వ్యర్థాలను తరలించడంతో పాటు రోడ్ల పక్కల పారబోయకుండా కట్టడి చేయాలన్నారు. సమావేశంలో ఉప కమిషనర్లు నరసింహ, మల్లారెడ్డి, ఏఎంహెచ్‌ఓలు కవిత, మమత, రాంకీ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.


సమావేశంలో సూచనలు చేస్తున్న అడిషనల్ కమిషనర్ రఘుప్రసాద్

మార్కెట్‌లో తిరుగులేని శక్తిగా 'భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్'


బీమా పత్రాలను అందజేస్తున్న టెక్నికల్ ఇంజినీర్ శివకుమార్, రాజేంద్రప్రసాద్

కుత్బుల్లాపూర్: సిమెంట్ వ్యాపారంలో మార్కెట్‌లో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5 స్టార్ గ్రేడ్ తెలంగాణలో విడుదల చేసిందని ఆ సంస్థ టెక్నికల్ ఇంజినీర్ శివకుమార్ అన్నారు. బుధవారం జగద్గిరిగుట్టలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వర ట్రేడర్స్ డీలర్ దుకాణంలో తాపీ మేస్త్రీల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందన్నారు. అల్ట్రాఫాస్ట్ సిమెంట్ ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు సరైన ఎంపిక అని పేర్కొన్నారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందచేస్తామని, స్లాబ్ కాంక్రెట్ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజినీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడవుతారని తెలియచేశారు. ఈ సందర్భంగా తాపీ మేస్త్రీలకు బీమా పత్రాలను అందజేశారు. అనంతరం డీలర్ ధర్మారెడ్డి మాట్లాడుతూ... భారతి సిమెంట్ సర్వీస్ చాలా వేగవంతంగా ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ మార్కెటింగ్ రాజేంద్ర ప్రసాద్, 20 మంది తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

పోకిరీలతో పరేషాన్

కుత్బుల్లాపూర్: 'పోకిరీలతో ఇబ్బందులు పడుతున్నాం.. రోడ్డు పైన సిగరెట్లు తాగుతూ వచ్చి పోయే మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు.. వీరిని కట్టడి చేయాలని కోరుతూ ఈ నెల 5వ తేదీన జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇంతవరకు చర్యలు తీసుకోలేదు' అని హెచ్‌ఎంటీ సొసైటీ ప్రజలు ఆరోపిస్తున్నారు. సొసైటీ కమ్యూనిటీ హాల్ సమీపంలోని ది స్కూల్ గల్లీలో ఉన్న ఓ కిరాణా షాపు ముందు రోజూ ఉదయం నుంచి రాత్రి వరకు యువకులు అడ్డగా మార్చుకొని సిగరెట్లు తాగుతూ వచ్చి పోయే మహిళల పట్ల వెకిలి చేష్టలు చేస్తూ ఇబ్బంది కలిగిస్తున్నారన్నారు. ఈ విషయంపై పలుమార్లు కిరాణా షాపు యజమాని వద్దకు వెళ్లి స్థానికులు చెప్పినా పట్టించుకోకుండా ఉండటంతో పలువురు ఇదే విషయంపై జీడిమెట్ల పోలీసులను ఆశ్రయించారు. ఎస్ఐ ఆంజనేయులు ఫిర్యాదు స్వీకరించినా అటువైపు కన్నెత్తి చూడలేదు. కనీసం పెట్రోలింగ్ పోలీసులను కూడా పంపలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిత్యం ఇక్కడ పోకిరీలు ఇబ్బందులు సృష్టిస్తున్న విషయంపై పోలీసులు సీరియస్‌గా వ్యవహరించాలని, రాబోయే రోజుల్లో ఈ ప్రాంతంలో జరిగే అనర్థాలకు పూర్తి బాధ్యత వహించాలని స్థానికులు కోరుతున్నారు.

రాజ్యాంగంపై విద్యార్థులకు అవగాహన అవసరం

సుభాష్‌నగర్: రాజ్యాంగం ద్వారా అన్ని సామాజిక వర్గాలకు సముచిత స్థానం కల్పించేందుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కృషి చేశారని కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. భారత రాజ్యాంగాన్ని పాఠ్యాంశంగా చేర్చాలని కోరుతూ దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో చేపట్టిన నిత్య పూలమాల కార్యక్రమం 62వ రోజుకు చేరుకున్న నేపథ్యంలో బుధవారం సూరారంలోని బీఆర్ అంబేడ్కర్, బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహాలకు ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ... భారత రాజ్యాంగంపై చిన్ననాటి నుంచే విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. కార్యక్రమంలో అల్ ఇండియా దళితా సేన అధ్యక్షుడు జేమ్స్, అంజన్న, భాస్కర్, చైర్మన్ గట్టు అశోక్, హరికిరణ్ పటేల్, నర్సింహారెడ్డి, కరణ్, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.


అంబేడ్కర్, బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేస్తున్న కొలన్ హన్మంతరెడ్డి

సౌత్ జోన్ బాస్కెట్ బాల్ పురుషుల జట్టు ఎంపిక


సెలక్షన్ ట్రయల్స్‌లో పాల్గొన్న వివిధ కళాశాలల క్రీడాకారులు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీ బాస్కెట్ బాల్ సెలక్షన్ ట్రయల్స్‌ను యూనివర్సిటీలో నిర్వహించారు. ఈ ట్రయల్స్‌లో వివిధ కళాశాలల నుంచి సుమారు 150 మంది పాల్గొన్నారు. సెలక్షన్లను జేఎన్‌టీయూహెచ్ సెక్రటరీ, స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రొఫెసర్ ఎన్ఎస్ దిలీప్, ఫిజికల్ డైరెక్టర్ డా.నల్లగొండ అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులు క్రైస్ట్ యూనివర్సిటీ బెంగళూరులో జరిగే సౌత్ జోన్ బాల్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని తెలిపారు. నవంబర్ 1 నుంచి 5వ తేదీ వరకు జరిగే టోర్నమెంట్‌లో జేఎన్‌టీయూ జట్టు పాల్గొననుంది. కోచ్ అమృత్‌రాజ్ పర్యవేక్షణలో సెలక్షన్ జరిగింది. కార్యక్రమంలో వివిధ కళాశాలలకు చెందిన ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొని క్రీడాకారులను అభినందించారు.

పారిశుద్ధ్య కార్మికులకు వైద్య శిబిరం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోన్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు, ఎంటమాలజీ సిబ్బందికి పలు ప్రాంతాల్లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం, పోషకాహారంపై అవగాహన కార్యక్రమం చివరి రోజు మూసాపేటలోని పర్వత్‌నగర్, మినీ ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఏర్పాటు చేశారు. జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ వైద్యులకు, సిబ్బందికి సన్మానం చేశారు. ఇప్పటి వరకు జరిగిన కార్యక్రమంలో 2400 మంది కార్మికులు పాల్గొన్నారని, 1030 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఐఎన్ నుంచి వచ్చిన అధికారులు, ఈఎస్ఐ వైద్యులు, ఉప కమిషనర్లు రమేష్, కార్తీక్, ఏఎంసీ శ్రీకాంత్‌రెడ్డి, జామీల్ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్

నేడు జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలు

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలు ఈ నెల 17న ఘట్కేసర్ మండలంలోని ఏదులాబాద్ తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల లలిత కళల పాఠశాలలో ఉదయం 9.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి తెలిపారు. మండల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు బాధ్యత తీసుకొని గురువారం ఉదయం 9.30 గంటలకు సంబంధిత పాఠశాలలో రిపోర్ట్ చేసి, జిల్లా స్థాయి పోటీలలో పాల్గొనాలని సూచించారు.

పారిశుద్ధ్య కార్మికులను విధుల నుంచి తొలగించడం అన్యాయం


ఆందోళనలు చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

ఘట్‌కేసర్: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు 140 మందిని విధుల నుంచి కమిషనర్ తొలగించడం అన్యాయమని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయచంద్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. పారిశుద్ధ్య కార్మికుల తొలగింపుకు నిరసనగా స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట వారితో బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులు ఉదయం, సాయంత్రం రెండు పూటలా విధులు నిర్వాహించాలని, లేని పక్షంలో విధుల నుంచి తొలగిస్తామని కమిషనర్ అనడం సమంజసం కాదన్నారు. కార్మికులను విధుల నుంచి తొలగించినట్లు కమిషనర్ ప్రకటించడంతో నిరసన చేపట్టామన్నారు. కౌన్సిల్ సభ్యులు స్పందించి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. నిరసనలో కార్మికులు నరసింహ, బాలకృష్ణ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కులగణనకు సిద్ధం

- సామాజిక సమగ్ర సర్వేకు యంత్రాంగం చర్యలు
- సర్వేతో జనాభా దామాషా ప్రకారం సామాజిక వర్గాల వారీగా ప్రాధాన్యం
- 2 నెలల్లో పూర్తయ్యేలా కసరత్తు



సాక్షి, సిటీబ్యూరో: నగర శివారుల్లో సమగ్ర కులగణన చేపట్టేందుకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఒకటి, రెండు రోజుల్లో మార్గదర్శకాలు వెలువడనున్నాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమాన్ని రెండు నెలల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆ దిశగా మేడ్చల్ జిల్లా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి సిబ్బందిని సన్నద్ధం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ సమయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2014లో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించింది. జనాభా దామాషా ప్రకారం ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు ఉండాలని కొన్నాళ్ల నుంచి బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో పదేళ్ల అనంతరం మరోసారి సమగ్ర కులగణన చేపట్టనుండటంతో ఆయా వర్గాల్లో ఉత్సాహం వ్యక్తమవుతోంది.

సమగ్ర వివరాల సేకరణ

కులగణనలో క్షేత్రస్థాయి సిబ్బంది ప్రతి కుటుంబం కులంతో పాటు వారి ఆర్థిక, సామాజిక, రాజకీయ స్థితిగతులు, విద్యా, ఉద్యోగం తదితర పరిస్థితులను సేకరించనున్నారు. వీటన్నింటినీ క్రోడీకరించి సమగ్ర నివేదికను జిల్లాల వారీగా ప్రభుత్వానికి నివేదించనున్నారు. బీసీల్లోని ఉపకులాలను సైతం ఈ సర్వేలో పొందుపర్చనున్నారు. దీని ద్వారానే రానున్న పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లు, స్థానిక సంస్థల్లో బీసీల కోటాను నిర్ధారించనున్నారు.

రాజకీయ అవకాశాలు లభిస్తాయని..

ప్రస్తుతం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ప్రస్తుత మొత్తం జనాభాలో బీసీలు అధికంగా ఉంటారని తెలుస్తోంది. జిల్లాలో ఆధిపత్య వర్గాల అండ లేకపోవడంతో బీసీలకు రాజకీయంగా సరైన ప్రాధాన్యం దక్కడం లేదని ఆయా సంఘాలు విమర్శిస్తున్నాయి. ఈ సర్వే ద్వారా బీసీ లెక్క తేలితే దాని ఆధారంగా రాజకీయ అవకాశాలు లభిస్తాయని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

- నోడల్ ఏజెన్సీగా ఉన్న ప్రణాళిక శాఖలో తగినంత సిబ్బంది లేకపోవడంతో రెండు నెలల పాటు జరిగే కుల గణన సర్వే కార్యక్రమంలో ఇతర శాఖల నుంచి పలువురిని డిప్యూటేషన్ మీద తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు విడుదలైన వెంటనే క్షేత్రస్థాయిలో పని మొదలు పెట్టాలని ఇప్పటికే ఉన్నతాధికారులకు ఆదేశాలు అందాయి. ఈ నేపథ్యంలో ఒకటి, రెండు రోజుల్లో దీనిపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఉన్నతాధికారులు దిశానిర్దేశం చేయనున్నట్లు సమాచారం.
- 2011జనాభా లెక్కల ప్రకారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొత్తం జనాభా 24,60,095 కాగా.. ఇందులో కుటుంబాల సంఖ్య (హౌజ్ హోల్డర్లు) 5,86,112 గా ఉంది. దాదాపు నాలుగేళ్ల తర్వాత 2014 సంవత్సరంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే (ఎస్‌కేఎస్) నిర్వహించిన సందర్భంగా జిల్లాలో మొత్తం జనాభా 28,05,365 ఉండగా..ఇందులో కుటుంబాల సంఖ్య(హౌజ్ హోల్డర్లు) 7,69,313 గా ఉంది. 2011 నుంచి 2014 వరకు దాదాపు నాలుగేళ్ల వ్యవధిలో జిల్లా జనాభా 3,45,270 పెరగగా..ఇందులో కుటుంబాల సంఖ్య(హౌజ్ హోల్డర్లు)1,71,201గా ఉంది.

2014లో మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వేలో కులాల వారీగా జనాభా వివరాలు ఇలా ఉన్నాయి.

	కుటుంబాల సంఖ్య	జనాభా
ఓసీ	2,96,379	10,62,969
బీసీ	3,43,326	12,63,522
ఎస్సీ	1,08,174	3,99,572
ఎస్టీ	21,434	79,302
	7,69,313	28,05,365

మెయిన్స్ పరీక్షలకు హాల్ టిక్కెట్లు రెడీ

గ్రూప్–1 పరీక్షలకు 3 జిల్లాల్లో 46 పరీక్షా కేంద్రాలు

సాక్షి,సిటీబ్యూరో: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలకు అభ్యర్థులు మొదటి పరీక్షకు ఉపయోగించిన హాల్ టిక్కెట్‌ను మిగిలిన 6 పరీక్షలకు (ఈ నెల 21 నుంచి 27 వరకు) ఉపయోగించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలకు గుర్తించబడిన 46 కేంద్రాలలో ఈ నెల 21 నుంచి 27 వరకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. హాల్ టిక్కెట్లు అందుబాటులో ఉంచామని కలెక్టరు తెలిపారు.

- అభ్యర్థులను మధ్యాహ్నం 12.30 గంటల నుంచి పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు. పరీక్షా కేంద్రం గేట్లు మధ్యాహ్నం 1.30 గంటలకు మూసివేస్తారన్నారు. మధ్యాహ్నం 1.30 గంటల తర్వాత అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించరని కలెక్టరు స్పష్టంగా తెలిపారు.
- అభ్యర్థులు నలుపు/నీలం బాల్ పాయింట్ పెన్నులు, పెన్సిల్-ఎరేజర్, హాల్ టికెట్‌పై అతికించిన ఫోటో, ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా చెల్లుబాటు అయ్యే ఒరిజినల్ ఫోటో ఐడీ కార్డ్‌ని మాత్రమే పరీక్ష హాల్‌లోకి తీసుకెళ్లాలన్నారు. అన్ని సమాధానాలు బాల్ పాయింట్ పెన్ (నీలం/నలుపు)తో మాత్రమే రాయాలని సూచించారు.

భెల్ ఎంఐజీ కాలనీలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి భెల్ ఎంఐజీ కాలనీలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌ను బుధవారం కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీలోని పార్కుల వద్ద ఉన్న చెత్తా చెదారాన్ని తొలగించాలని శానిటేషన్ విభాగం సిబ్బందికి సూచించారు. కాలనీవాసులు చెత్తను తడి, పొడిగా వేరు చేసి స్వచ్ఛ ఆటోలకు అందజేసి కాలనీ పరిశుభ్రంగా ఉంచడంలో భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. చెత్తను రోడ్డుపై వేసిన వారికి జరిమానాలు విధిస్తామని శేరిలింగంపల్లి సర్కిల్ ఉప వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ డ్రైవ్‌ను 21 రోజుల పాటు కొనసాగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ డైరెక్టర్లు వెంకట్‌రావు, సుబ్బారావు, నారాయణగౌడ్, శానిటరీ సూపర్‌వైజర్ వెంకట్, ఎస్ఆర్‌పీ భరత్ తదితరులు పాల్గొన్నారు.

హైడ్రా బాధితులకు అండగా ఉంటాం


ఎమ్మెల్యేల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి

కాప్రా: నగరంలో హైడ్రా బాధితులకు అండగా ఉంటామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం తెలంగాణభవన్‌లో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మూసీ సుందరీకరణ, హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూల్చుతున్నారని, బాధితులకు బీఆర్ఎస్ పార్టీ లీగల్ టీమ్ అందుబాటులోఉంటుందన్నారు. హైడ్రా, మూసీ బాధితుల కోసం లీగల్ సాయంకోసంతెలంగాణ భవన్‌లో న్యాయవాదుల బృందం అందుబాటులో ఉంచుతున్నట్లు కేటీఆర్ తెలిపినట్లు ఎమ్మెల్యే వివరించారు.